# సమాధి - పునాది

ప్రకాశం కళ్ళు తెరచి చూసేసరికి ఎదురుగా చెల్లెలు మాలతి! యధాలాపంలో అదాటుగా చూశాడేమో తన కంటే కూడా పెద్దదిగా కనిపించింది ఆమె! చిన్నప్పుడు తను మాలతిని ఎత్తుకొని మోశాడు. బొమ్మలు ముందుపెట్టి ఏడవకుండా ఆడించాడు! నిన్న మొన్నటి వరకు పరికిణీలు, జాకెట్లు-ఇప్పుడు ఆరేసి గజాల చీరలే కట్టేస్తోంది! నిజంగా ఆడపిల్లలు ఎంతలో ఎంతెదిగిపోతారు!

సావిత్రీ అంతేనేమో! చూసి యాడాదిపైనయింది మాలతికంటే కూడా కొంచెం భారీ మనిషి మరి. ఇపుడు తను గుర్తుపట్టగలడో లేదో ఆమెను!

హరి పర్సనాల్టీ బాగుంటుంది. అందుకు తగ్గట్టే తెలివితేటలు కాబట్టే ఈ గడ్డు కాలంలో కూడా తేలిగ్గా ఉద్యోగం దొరికింది. ఎంతటి అదృష్టం వాడిది!

“నాకు ఉద్యోగం దొరికింది ప్రకాష్ నిన్ను గురించీ నేను ఆలోచిస్తూనే ఉన్నాను. మొదట్నుంచీ మామయ్య మా కుటుంబానికి చేసిన సహాయం జన్మ జన్మలకూ మరువరానిది. ఆయన మీద గౌరవం కొద్దీ నేను మాలతిని చేసుకోవటానికి ఇప్పటికీ సిద్ధంగా ఉన్నాను అయితే, నువ్వు నా చెల్లెలు సావిత్రిని చేసుకు తీరాలి. మన రెండు పెళ్ళిళ్ళూ ఒకే ముహూర్తాన ఒకే వేదికమీద జరగాలి ఇది అనారోగ్యంతో బాధపడుతున్న మా అమ్మ కోర్కె. బహుశా అత్తయ్యా కూడా ఇలాగే భావిస్తూ ఉంటుందను కొంటున్నాను.” అంటూ రెండు మాసాల క్రితం హరి ఉత్తరం వ్రాశాడు. నిజంగా వాడిదెంత మంచి మనసు!

“ఈ వేళ నీపుట్టిన రోజు గుర్తుందా అన్నయ్యా?” మాలతి ప్రశ్నకు ఉలిక్కి-పడ్డాడు ప్రకాశం.

గుర్తుఉంది కాని ఆ వుత్సాహం లేదు ప్రకాశానికి 'అయినా, ఆ ఆడంబరాలన్నీ ఉన్నవాళ్ళకుగాని నిరుద్యోగి తనకేమిటి?' అనే మౌనంగా ఊరుకుండిపోయాడు అతడు.

“అన్నాయ్! నిరుద్యోగం, దారిద్ర్యం- ఇది మన జీవిత సమస్యలు ఒక్క-రోజులో తీరిపోవాలంటే తీరిపోవు అందుకని కనీసం ఈవేళ్టికైనా నీ నిరాశ-నిట్టూర్పులను కట్టిపెట్టి త్వరగా తెమిలి తలంటి పోసుకో.” ఆరిందాలా చెప్పింది మాలతి.

రూపంలోనే కాదు. గుణంలో కూడా చెల్లాయి తనకంటే పెద్దదేమో అనిపించింది ప్రకాశానికి.

“ఒరేయ్ అబ్బాయ్, ఈవేళ నీ పుట్టిన రోజు కట్టెపుల్లలు అయిపోయాయి

---

“అన్నపూర్ణ”

మరి వేణ్ణీళ్ళు పెట్టలేదురా." స్నానానికి నీళ్ళు పెడుతూ అంది ప్రకాశం తల్లి బాధగా స్వరంపెట్టి.

"పరవాలేదులే అమ్మా కాసిని కుంకుడునీళ్ళు నెత్తిన పోస్తే- చన్నీళ్ళే పోసుకుంటాను వేణ్ణీళ్ళకు ఇదేమయినా చలికాలమా?"

తల్లిని తాత్కాలికంగా తృప్తిపరచ టానికి అలా మాట్లాడినా ప్రకాశం గొంతు బొంగురుపోక మానలేదు చివరిలో.

* * *

"అన్నయ్యా ఉత్తరం" మాలతి ఉత్తరం తెచ్చి ఇచ్చి లోపలికెళ్ళింది మళ్ళీ.

ఆతృతగా ఉత్తరాన్ని చించాడు. అది సావిత్రి దగ్గర్నుంచీ వచ్చింది తన సావిత్రే!

అక్షరాలు చక్కగా ఉన్నాయి. దృష్టి చకచక పారింది.

"ప్రకాశం బావకు,

నమస్కారాలు. బావా ఇక్కడొకచోట ఏదో ఉద్యోగం ఖాళీగాఉందట వెంటనే బయలుదేరి రావలసిందిగా అన్నయ్య నీకు వ్రాయమన్నాడు మాలతిని అడిగినట్లు చెప్పగలవు. అత్తయ్యకు నా వందనములు తెలుపగలవు అమ్మ ఒంట్లో ఇంకానలతగానేఉంటోంది. నీవు వెంటనే బయలుదేరి వస్తావుకదూ? ఎదురుచూస్తూంటాం.

సావిత్రి."

చాలా క్లుప్తంగానే ఉన్నా ఆ ఉత్తరం ప్రకాశాన్ని సంతోషంలో ముంచివేసింది. తనకు ఉద్యోగం దొరకబోతోంది! అతడి కాళ్ళు క్రింద ఆనటంలేదు.

"అమ్మా! చెల్లాయ్!" అక్కణ్ణుంచే పెద్దగా అరిచాడు పట్టలేక.

అతడి ఆ పిలుపుకు అదిరిపడి వంటింట్లో చేస్తున్న పనులు ఎక్కడివక్కడ వదిలివేసి హాలులోకి పరుగెట్టుకొచ్చారు మాలతి.



సరస్వతమ్మలు.

*  *  *

ప్రకాశం ఎక్కిన రైలుపెట్టె అంత రద్దీగా లేదు కూర్చోవటానికి తేలిక గానే సీటు దొరికింది. తాపీగా కూర్చున్న తర్వాత కలిసొచ్చే రోజువస్తే నడిచొచ్చే కొడుకు పుడుతాడన్న సామెత టక్కున గుర్తు వచ్చిందతడికి. మరి లోగడ ఎన్ని సార్లు గంటల తరబడీ నిలబడి ప్రయాణం చేయలేదు అదే రైల్లో.

విండో ప్రక్కన సింగిల్ సీటులో కూర్చున్నాడు ప్రకాశం. బయటకు చూస్తే టెలిగ్రాఫ్ స్థంభాలు, చెట్లు, కొండలు అన్నీ గిర్రున తిరిగిపోతున్నట్లు కనిపిస్తు న్నాయి. అంతకు మించిన వేగంతో ఆలోచనలు.

తను ఉద్యోగంలో చేరి నిండా రెణ్ణెల్లయినా కాలేదు! అప్పుడే మరోళ్ళకు బ్రతుకు తెరువుచూపే స్థితిలోకి వచ్చాడంటే నిజంగా హరి ఎంత తెలివికలవాడు! తనని గురించి ఇంత తొందరగా ఉద్యోగ ప్రయత్నం చేయటం- ఇది వాడి స్వార్థం కదూ?

ఎలా అవుతుంది? తన చెల్లెల్ని వాడు చేసుకోవటం లేదూ మరి? ఇవేం కావు. వస్తుతః వాడికి బంధుప్రీతి ఎక్కువ ముఖ్యంగా చనిపోయిన తన తండ్రిపట్ల వాడికి కల అచంచల విశ్వాసం.

మామయ్య హరికి చిన్నతనంలోనే పోయాడు. ఎటూ దిక్కుతోచని స్థితితో ఉన్న పార్వతి అత్తయ్యను, ఆమె బిడ్డ లను తన తండ్రి ఆదుతున్నాడు. నెలనెలా కొంత డబ్బు ఇస్తూండేవాడు. కేవలం ఆ డబ్బుతోనే బ్రతకలేదని ఆమెకు ఒక కుట్టుమిషన్ కొనిపెట్టాడు. కుట్టుపనిలో లోగడ కొంత అనుభవం ఉండటంవల్ల అత్తయ్యకు అదో చేదోడు వాదోడు అయింది. అలాగే కష్టపడి తన బిడ్డలను చదివించింది. ఏ కారణం వల్లో సావిత్రి స్కూల్‌ఫైనల్ వరకు చదివింది కానీ పరీక్షలు వ్రాయలేదు. హరి మాత్రం డిగ్రీ సంపాదించాడు.

తన కొడుక్కు ఉద్యోగం దొరికింది. కూతురికి పెళ్ళి కాబోతోంది. ఇంకేమిటి అత్తయ్యకు తక్కువ?

అమ్మ? ఆవిడకు మాత్రం ఇంకేం లోటు? తనకు ఉద్యోగం దొరకబోతోంది, చెల్లాయిని హరి చేసుకోబోతున్నాడు!

అయితే, నాన్న అకస్మాత్తుగా గుండె ఆగి చనిపోయిన తర్వాత- ఈ రెండేళ్లుగా తాము నరకమే అనుభవించారు. ఏదో నాన్న పేర ఉన్న ఇన్సూరెన్స్ డబ్బు కొంత రావటంవల్ల ఇంతకాలమూ అదోలా గడిచింది. ఇపుడు ఆ డబ్బూ అయిపో యింది. బ్రతుకే సమస్య.

ఇటువంటి కష్టసమయంలో తమ కుటుంబాన్ని ఆదుకోబోతున్నాడు హరి. నిజంగావాడు తన పాలిట దైవం.

*  *  *

ఆ ఇంట్లో అడుగుపెట్టిన ప్రకాశానికి ముందుగా మంచంలో ఉన్న పార్వతమ్మ కనిపించింది.

"ఎవరూ? ప్రకాశమా? రా బాబూ." ఆవిడ కంఠం చాలా నీరసంగా ధ్వనిం చింది.

ప్రకాశం వెళ్ళి పార్వతమ్మ ప్రక్కన

కూర్చొని, "నువ్ మంచంలోంచీ లేవటం లేదా బొత్తిగా?" అడిగాడు.

"అంత లేవలేని స్థితి ఏంలేదు. ఏదో ఒంట్లో నీరసంగా ఉంటే పడుకున్నాను." మామూలుగానే అన్నది పార్వతమ్మ

అప్పుడే లోపల్నుంచీ వచ్చింది సావిత్రి

"నువ్వా బావా! ఇదేనా రావటం?!" అడిగింది తలుపువార నిలబడి.

"అవును సావిత్రీ బాగున్నావా? నువ్వు వ్రాసిన ఉత్తరం నిన్ననే అందింది" అంటూ లేచి సావిత్రికి దగ్గిరగా వచ్చాడు ప్రకాశం.

"వెంఒనే బయిలుదేరి వచ్చేశావన్న మాట!" అంది సావిత్రి అదోమాదిరి నవ్వుతూ

"నువ్వెప్పుడు ఉత్తరం వ్రాశావే ప్రకాశానికి?" అయోమయంగా అడిగింది పార్వతమ్మ.

"మొన్న వ్రాశాలే. అయినా అన్ని విషయాలూ నీకెందుకు?" అని తల్లిని విదిలించికొట్టి, "వంట చేస్తున్నాను. లోపలకు రా బావా మాట్లాడుకొంటూ కూర్చుందాం" అంది సావిత్రి

ఇక తనకు ఏమీ పట్టనట్లు ఊరుకొంది పార్వతమ్మ. పెరట్లోకి వెళ్ళి కాళ్ళు కడుక్కువచ్చి సావిత్రివేసిన పీటమీద గోడకు ఆనుకొని కూర్చున్నాడు ప్రకాశం

"హరి ఏడి సావిత్రీ? ఈ రోజు ఆది వారం ఆఫీసుకు శలవుకదా?" అడిగాడు

"ఏమో ఎక్కడికి వెళ్ళాడో చెప్పి వెళ్ళలేదు, ఎప్పుడు వస్తాడో తెలియదు." జవాబిచ్చింది




"అద్సరే గాని... ఆ జాకెట్ పీస్ ఎక్కడ తీశావు? చెవి రింగులు బంగారమేనా?? చీర డిజైన్ బాగుంది...
ఎంతండి...???"

తర్వాత సంభాషణ ప్రకాశం తల్లి, చెల్లెలు. వాళ్ళ యోగక్షేమాల మీదకు మళ్ళింది.

"అత్తయ్యనూ, మాలతినీ కూడా తీసుకువస్తే బాగుండేది."

"నీ ఉత్తరంలో వాళ్ళను రమ్మని లేదుగా!" నవ్వుతూనే అన్నాడు.

సావిత్రి ముఖం అదోమాదిరి మారింది.

అంత కలుపుగోలుగా మాట్లాడుతున్న ఆమెతో ఇంకేమేమో మాట్లాడాలని పరుగులు తీస్తున్నది ప్రకాశం ప్రేమ హృదయం.

* * *

మధ్యాహ్నం మూడుగంటలకు ఆదరాబాదరాగా వచ్చాడు హరి. నట్టింట్లో సావిత్రితో మాట్లాడుతూ కూర్చున్న

ప్రకాశాన్ని చూసిన అతడి ఆశ్చర్యానికి అంతులేదు.

"ప్రకాష్! నువ్వెప్పుడు— ఎలా వచ్చావ్!"

హరి విగ్రహాన్ని చూసిన తొలి క్షణంలో పట్టరాని ఆనందం కలిగినా, మరుక్షణం అతడు వ్యక్తంచేసిన ఆశ్చర్యానికి విస్తుబోయాడు ప్రకాశం.

ప్రకాశంలో వస్తున్న మార్పుల్ని గమనించి వెంటనే అందుకొంది సావిత్రి.

"అదేమిటి-నువ్వేగా ఉత్తరం వ్రాయమంది? నేనే వ్రాశాను. నువ్వు ఇప్పిస్తానన్న ఉద్యోగం మీద గంపెడు ఆశపెట్టుకొచ్చాడు బావ" అని వెనక్కితిరిగి చూడకుండా లోపలకు వెళ్ళింది ఆమె

"ఓహో" అని ఊరుకున్నాడు హరి. అతడి ముఖం ఎలాగో ఉందప్పుడు.

"ప్రొద్దుననగా వెళ్ళావు ఇప్పుడా వచ్చేది? సెలవురోజుకద? ఇల్లు, తల్లి, చెల్లి ఎవరూ నీకు అక్కరలేదన్నమాట!" పార్వతమ్మ కొడుకుమీద నిష్టూరాలాడింది.

తల్లివైపు ఒకసారి చూశాడు కానీ మారు మాట్లాడలేదు హరి.

"నీ మౌన వ్రతమేమిటో అంతుబట్టకుండా ఉంది. సరే భోంచేయలేదు గామలు వెళ్ళు. అమ్మాయ్ సావిత్రీ" లోపలకు కేక వేసింది పార్వతమ్మ.

"అన్నీ సిద్ధం చేసిపెట్టాను. వెళ్ళి తినమను" అంటూ తిరిగి అక్కడికే వచ్చింది సావిత్రి.

"వాణ్ణి వెళ్ళి తినమంటున్నావా? మొగవాడు వాడెలా పెట్టుకుతింటాడే? రాను రాను నువ్వు మరీ పెంకిఘటానివై పోతున్నావ్" కోపంగా చూసింది పార్వతమ్మ కూతురివైపు.

"అమ్మా! .. నీకెన్నిసార్లు చెప్పాలి? నా విషయంలో సావిత్రి ఎలా ప్రవర్తించినా నువ్వు కలిగించుకోవద్దు" అని త్వర త్వరగా వంటింటివైపు వెళ్ళాడు హరి.

హరి అవస్థను చూసిన ప్రకాశానికి ఎంతో జాలి అనిపించింది. ఆ వెంట మాలతి గుర్తుకు వచ్చింది. ఏవేళకు ఇంటికి వచ్చినా చెల్లాయయితే తననలా అనగలిగేదా? మరి ఎక్కడొచ్చింది సావిత్రిలో లోపం? ఆమె పెరిగిన వాతావరణమా? హరి మనస్తత్వం నచ్చక అలా ప్రవర్తిస్తోందా?


పైగా సావిత్రి తనకు వ్రాసిన ఉత్తరం గురించి అత్తయ్యకు తెలియనే తెలియదట! మరి హరికీ తెలుసో తెలియదో? అటూ ఇటూ కాకుండా ఉంది వాడి సమాధానం. అయితే ఆమె తనని ఇక్కడకు ఎందుకు రప్పించినట్లు. ఆలోచిస్తున్నాడు ప్రకాశం.

* * *

సాయంత్రంఅలా షికారుగా పార్కుకు వెళ్ళారు ప్రకాశం, హరీ.

చక్కటి ఉద్యోగం దొరికింది. సావిత్రి పెళ్ళికి ఇబ్బందిలేదు అయినా హరి అదోమాదిరి నలతగా, ఏదో పోగొట్టుకున్నట్లు దిగులుగా కనిపించటం చూసి ప్రకాశం రకరకాలుగా ఊహిస్తూనే వున్నాడు.

ఒకవేళ వాడు ఏమైనా ప్రేమ వ్యవహారంలో పడ్డాడా? సావిత్రి అందుకు ప్రతిబంధకం అయిందా? మాలతిని చేసుకోవటం ఇష్టంలేదా? అవును. అంతే




అయివుంటుంది. సావిత్రిని తను చేసుకొంటే మాలతిని వాడు చేసుకు తీరాలి. ఈ నిబంధనకు కట్టుబడకపోతే తను సావిత్రిని చేసుకోడు. అన్నగా బరువు బాధ్యతలు తీరవు అనుకున్నాడేమో? అది వాడి భ్రమే. ఇష్టంలేని పెళ్ళిచేసి చెల్లాయి బ్రతుకును నరకం చేయగలడా తను?.... ఇక సావిత్రి అంగీకరిస్తే నిర్నిబంధంగా తను చేసుకోవటానికి సిద్ధం ఆమెను....

తన ఊహాలను, నిర్ణయాలను హరి ముందు పెట్టాడు ప్రకాశం.

"ఛ. ఛ. అదేంలేదు ప్రకాష్. నా మనసు మరొకరిదైతే నీకు లోగడ అలా ఉత్తరం వ్రాసేవాణ్ణే కాదు" అన్నాడు హరి.

"ఇది పైమాట ముఖస్తుతికొద్దీ అలా అంటున్నావేకానీ నీ ఆంతర్యంవేరు."

"లేదు....నీ వూహ పొరబాటు."

"నేన్నమ్మను. నీ పరధ్యానము, ఆ దిగులు నన్ను మభ్యపరచాలని చూడకు హరీ. జీవితాలతో మనం చెలగాటలాడుకో కూడదు." తీక్షణంగా చూశాడు ప్రకాశం.

"సరే. నీవు ఏ విధంగానైనా ఊహించుకోనన్ను...." అని నిట్టూరుస్తూ లేచాడు హరి. అతణ్ణనుసరించాడు ప్రకాశం.

"నీ ఉద్యోగం గురించి ప్రయత్నిస్తాను. అప్పుడే వెళ్ళకు. నాలుగు రోజుల పాటు ఉండు ప్రకాష్" అన్నాడు హరి నడుస్తూ. తర్వాతా అతడే "నేను ఒక మిత్రుణ్ణి కలుసుకోవాలి ఆరు గంటలకు. నువ్వు ఏదైనా పిక్చరుకు వెళ్ళు. థియేటర్ దగ్గరకు వచ్చి కలుస్తాలే" అన్నాడు.

సరే అని పిక్చరుకు వెళ్ళాడు ప్రకాష్. షో వదిలిన తర్వాత థియేటర్ బయటకు

వచ్చి హరికోసం చూశాడు కాసేపు నిల బడి. జాడలేదు. ఒక్కడే ఉస్సూరంటూ ఇంటికి తిరిగివచ్చాడు.

తలుపులు దగ్గరకు వేసి వున్నయ్ పార్వతమ్మ వంటరిగా పడుకొనివుంది. సావిత్రి కనిపించలేదు లోపల

"సావిత్రి ఎక్కడకు వెళ్ళిం దత్తయ్యా!" అడిగాడు మెలకువలోనే ఉంది పార్వతమ్మ.

"ఎవరో స్నేహితురాలింటికట మీరటు వెళ్ళారు. అదిటు వెళ్ళింది ఏమిటో వీళ్ళ తిరుగుళ్ళు? ఈ చివరిదశలో నన్ను క్షోభ పెడ్తున్నారు ప్రకాష్. వీళ్ళిద్దరూను " కన్నీటి పర్యంతమైంది ఆమె.

అత్తయ్యవైపు జాలిగా చూడటం మినహా పెదవి కూడా కదపలేదు ప్రకాష్.

" నువ్వు అన్నం తినలేదుగా? పద ప్రకాష్. నేను వడ్డిస్తాను" అంటూ లేవ బోయింది పార్వతమ్మ

"వద్దులే అత్తయ్యా! హరి, సావిత్రి వచ్చాక పుగ్గురం కలిసి తింటాంలే" అని ప్రక్కనే వున్న వాలుకుర్చీలో చేరగిలబడి రోడ్డుమీదకు చూస్తూండిపోయాడు ప్రకాష్

పార్వతమ్మ అతణ్ణి మరి వత్తిడిపెట్ట లేదు భోజనానికని

అలా చూస్తూ చూస్తూండగానే ప్రకా శానికి ఏనుకుపట్టింది. ప్రక్కింటి గోడ గడియారం టంగ్‌టంగ్‌న పదకొండుసార్లు మ్రోగింది అప్పుడే రోడ్డుమీద సైకిల్ రిక్షా బెల్ గణగణమని చప్పుడైంది. అఘాటున మెలకువ వచ్చి కళ్ళు తెరిచాడు ప్రకాశం.

రిక్షావాడికి డబ్బులిచ్చి లోపలకు వస్తోంది సావిత్రి.

"సాయంత్రం ఒక్కదానికీ ఇంట్లో ఏమీ తోచక అలా ఒక స్నేహితురాలింటికి వెళ్ళాను. దాని బలవంతంమీద సినిమా తప్పలేదు అయితే ఏం? ఒక దెబ్బకు రెండు పిట్టలు. నా స్నేహితురాలు ఉందే-దాని తండ్రి ఒక పొలిటీషియన్. మంచి లీడరు నీ పరిస్థితి అంతా చెప్పాను. అందుకు అదెంతో జాలిపడింది. డెఫ నెట్‌గా రికమండ్‌చేసి వాళ్ళ నాన్నగారి ద్వారా నీకు ఏదో ఒక ఉద్యోగం ఇప్పించి తీరుతానంది. ఇది ఖాయం. నువ్వింక నిశ్చింతగా ఉండొచ్చు బావా!" అంది ఆమె తనకు తానుగా కల్పించుకొని.

ఆ మాట, ఆ తీరు—సావిత్రి చెప్పిన దాంట్లో వీసమెత్తు అబద్ధం లేదనిపించింది ప్రకాష్‌కు. బ్రతుకుమీద ధైర్యం పూర్తిగా ఏర్పడింది అతడిలో అప్పుడే

అప్పుడే హరి వచ్చాడు?

"సారీ ప్రకాష్! నే వెళ్ళిన పని తెమల లేదు ఎంతకూ అందుకే థియేటర్ దగ్గర నీకు కలవలేకపోయాను." అన్నాడు.

"దానిదేముందిలే హరీ! దట్సాల్ " అని ఊరుకున్నాడు ప్రకాశం.

గుడ్లు వప్పగించి అందర్నీ కనిపెడు తున్నదేగాని పెదవి విప్పటంలేదు పార్వ తమ్మ

* * *

మూడు రోజులు అదోమాదిరి గడిచి పోయాయి.

గడిచిన ఆ మూడురోజుల్లోనూ ఉదయం ఆఫీసుకని నాలుగు మెతుకులు తిని వెళ్తున్న హరి రాత్రి ఏ పది పదకొండు

గంటలకో ఇంటికి వస్తున్నాడు. సావిత్రి కూడా సాయంత్రం ఆరు అయ్యేసరికి తన మిత్రురాలి ఇంటికని వెళ్ళి దాదాపు హరి వచ్చేసమయానికే గూటికి చేరుకొంటోంది

ఇంట్లో ఒంటరిగా మిగులుతున్న ప్రకాష్ పార్వతమ్మ గోడు వినలేకుండా ఉన్నాడు.

నాలుగోనాడు ఇలా కాదని హరి అయిష్టంగా మొహంపెట్టినాగాని లెక్క చేయకుండా అతడివెంట ఆఫీసుకు వెళ్ళాడు ప్రకాష్.

ఆఫీసులో కూడా హరి అంత ఉత్సాహంగా కనిపించలేదు. మౌనంగానే తన పనులు ముగించుకో సాగాడు. సాయంత్రం ఆఫీసు వదిలాక "సరేపద, నేనూ ఇంటికే వస్తున్నాను" అని ప్రకాష్‌తో కలిసి ఇంటికి వచ్చాడు

సావిత్రి అంతకుముందే బయటకు వెళ్ళినట్లు చెప్పింది పార్వతమ్మ.

"అహాఁ" అని ముభావంగానే ఊరుకుండిపోయాడు హరి

ఇద్దరూ గదిలో ప్రశాంతంగా కూర్చున్నారు.

"ఒరేయ్ హరీ, నేను వచ్చిందగ్గర్నించీ చూస్తున్నాను నువ్ చాలా మారిపోయావురా. ఆ మార్పు ఎందువల్ల వచ్చిందో తెలియటంలేదు నన్నేమిటో దూరదూరంగా నెట్టిపారేయాలని చూస్తున్నావు ఎక్కడికక్కడ" అన్నాడు మనసులో ఉండబట్టలేక ప్రకాష్.

హరి ముఖం పేలవంగా మారింది, అయినా మౌనాన్ని వదల్లేదతడు.

అదే అదును అనుకొని ఇంకా చాలా



"అయ్యో... మళ్ళీ... ఆఁ... నాకిక ప్రమోషన్లూ ఇంక్రిమెంట్లూ లేకుండా చేశావు గదా!!"

చాలా మాట్లాడాడు ప్రకాష్. "నీవల్ల అత్తయ్య ఎంత వేదన చెందుతోంది? వేళకు ఇంటికివస్తే ఆవిడ మనసుకెంత శాంతి లభిస్తుంది? నీవు ఇంట్లో ఉండి కులాసాగా కబుర్లు చెబుతుంటే ఆ స్నేహితురాలనీ, ఈ స్నేహితురాలనీ సావిత్రి ఎందుకు వెళ్తుంది?" అనడిగాడు

"అమ్మ చేసుకున్న పుణ్యంఅలాంటిది. నువ్వు అనుకుంటున్నావుగానీ, ప్రకాష్, నేను ఎటూ వెళ్ళకుండా ఇంట్లోనేవున్నా, చెల్లాయి తన స్నేహితురాండ్ర ఇళ్ళకు వెళ్ళకుండా ఉన్నా ఈ ఇంటి పరిస్థితింతే. దీన్నిమించి అడక్కు. నేను చెప్పలేను" అన్నాడు హరి కంటతడితో.

ఆ మాటలు ప్రకాష్‌కు బోధపడలేదు. ఏమనుకున్నాడో హరి, వెంటనే తన మాటలను తిప్పేసుకున్నాడు.

"నా ఆంతర్యమేమిటంటే త్వరగా

నీకు ఉద్యోగం దొరకాలి. చెల్లాయికి పెళ్ళి కావాలి. ఈ ఇంటికి మాలతి రావాలి అప్పుడే మాకు ప్రశాంతత లభించేది నేను ప్రస్తుతం మాస్పుకోరే మనిషిని ప్రకాష్" అంటూ

ఆ రాత్రి కొంచెం తొందరగానే ఇంటికి వచ్చింది సావిత్రి వచ్చిన చాలా సేపటివరకు ఆమె ఎవరితోనూ ఏం మాట్లాడలేదు. చివరకు ఏదో తప్పదన్నట్లు ప్రకాష్‌ను అన్నానికి పిలిచింది. అతనితో పాటు హరీ వచ్చాడు ఇద్దరికీ వడ్డించింది

అందరూ పడుకున్నారు. నట్టింట్లో వరుసన మంచాలు వేసి వున్నాయి.

అప్పుడు టైమెంతయిందో తెలియదు. ఎవరిదో చేయి తన మీద పడేసరికి ఉలిక్కిపడి లేచాడు ప్రకాశం

"నేనే బావా!" సన్నగా అంటూ చనువుగా ప్రక్కన కూర్చొంది సావిత్రి

ఖంగారుపడి అటూ ఇటూ చూశాడు ప్రకాశం. ఒక ప్రక్క పార్వతమ్మ మరో ప్రక్క హరి పడుకొని ఉన్నారు. నిద్ర బోతూ

"నీతో ఒక విషయం చెప్పాలి మా స్నేహితురాలి తండ్రిని కలిసి మాట్లాడాను ఆయన రేపే ఢిల్లీ వెళ్తున్నారట పదిరోజులవరకు రాకపోవచ్చు తిరిగి వచ్చాక మాత్రం నీ సంగతి తప్పక చూస్తానన్నారు. చూడటమేమిటి! నీకు ఉద్యోగం ఖాయమే. ఇక ఈ పదిరోజులూ ఇక్కడ ఉన్నా సరే. లేదా మీ వూరు వెళ్ళి వచ్చినా సరే నీ ఇష్టం ఇది చెప్పటానికే నిన్ను లేపాను" అంటూ లేచింది సావిత్రి.

"సరే సావిత్రీ అయితే నేను ఇంటికే వెళ్తాను. మీ స్నేహితురాలి తండ్రి వచ్చాక ఒక ఉత్తరం వ్రాయి తప్పకుండావస్తాను" అన్నాడు ప్రకాష్.

"అలాగే" అని వెళ్ళి పడుకొంది సావిత్రి

* * *

"పోస్ట్!" అన్న కేక విని బయటకు టకు వచ్చాడు ప్రకాష్ ఓ కవరు ఇచ్చి వెళ్ళిపోయాడు పోస్టుమాన్.

'సావిత్రి వ్రాసిందా! తను వచ్చినిండా మూడు రోజులైనా కాలేదు. అప్పుడే' ఆ మిత్రురాలి తండ్రి ఢిల్లీనుంచీ పదిరోజుల దాకా రారని చెప్పింది. మరి! ఏమిటో విశేషం' అని ఆశ్చర్యంగా కవరుచించి ఆతృతగా చదువసాగాడు.


"ప్రకాశం బావకు,

నమస్కారములు. నాకు తెలుసు. నీవు ఈ వుత్తరం చూసి ఎంతో ఆశ్చర్య పోతావ్. నా స్నేహితురాలి తండ్రి ఢిల్లీ నుంచీ పదిరోజుల దాకా రారని చెప్పి నీవు మీ వూరు వెళ్ళిన మర్నాడే దీన్ని వ్రాస్తున్నాను. అవసరం అనిపించింది మరి__

అదృష్ట దురదృష్టాలు 'టైమ్'నుబట్టి బయట పడుతూంటాయి. కాలానికి ఎదురీదాలను కోవటం వ్యర్థ ప్రయాసే. కాదంటావా'

బావా! నిన్ను నేనేమిటి. అన్నయ్యేమిటి ఇద్దరం మభ్యపరిచాం. నీ ముందు నటించాం. అమ్మ మాత్రం ఏ పాపం ఎరుగని పుణ్యాత్మురాలు. ఆమెను అపార్థం చేసుకోకు. అసలు విషయం చెప్పబోయే ముందు దానికి అనుసంధింపబడియున్న మా యింటి పరిస్థితి కొంత ప్రస్తావించక

నడుం నొప్పి డాక్టర్!!



తప్పదు.

నీకు తెలుసు. మాది పేద సంసారం. మీనాన్న సహాయ సహకారాల మీదే నాన్న పోయింది మొదలు మేం బ్రతుకుతున్నాం. అమ్మకూడా ఒళ్ళు దాచుకోకుండా మిషను కుట్టి అంతో ఇంతో సంపాదించేది. నాన్న బ్రతికున్నప్పుడు అన్నయ్య గారాల బిడ్డగా పెరిగాడు. అమ్మ కూడా వాణ్ణి పల్లెత్తు మాట అనకుండా చూసేది. మరి వాడిది ఏ రాతితో చేసిన హృదయమో మా పేదరికాన్ని, అమ్మ రెక్కల కష్టాన్ని గుర్తించే వాడు కాదు. ఎంత డబ్బూ వాడి ఖర్చులకే సరిపోయేది కాదు. నేను స్కూల్ ఫైనల్ వరకు చదివాను. అయితే పరీక్షలు వ్రాయ లేకపోయాను. ఎందుచేతనంటావ్? పరీక్ష ఫీజు కట్టకపోవటమే. నా పరీక్షల ఫీజుకని దాచిన డబ్బును వాడు ఎక్స్‌కర్షన్ పేరిట ఏదో ఊరు వెళ్ళటానికి అమ్మమాట వినకుండా, నా పరిస్థితిని గురించి ఆలోచించకుండా వెళ్ళాడు. ఆ తర్వాత నేను ఆ పరీక్ష పూర్తిచేయలేక పోయాను.

అన్నయ్య చదువులు పూర్తయ్యాయి. ఈలోగా అమ్మ ఆరోగ్యం చెడిపోయింది. అది వరకులా నెలనెలా డబ్బు పంపటానికి మామయ్యలేడు. పేదరికం అంటే ఎట్లా వుంటుందో నెమ్మది నెమ్మదిగా వాడి అనుభవంలోకి రాసాగింది. అదివరకు లక్షాధికారి బిడ్డలా విలాసంగా బ్రతికిన వాడు ఇప్పుడు కూటికి గతిలేనివాడుగా చలామణీకావటం-ప్రిస్టేజీ ప్రశ్నవచ్చింది. బయట నలుగురిలో ఏదో ఉద్యోగం సంపాదించి తీరాలని విశ్వప్రయత్నం చేశాడు. వాడి ప్రయత్నం ఫలప్రదం కాలేదు.

పరిస్థితులు ఇలా వుండగానే ఒకరోజు ఇంటికి ఎంతో హుషారుగా వచ్చాడు. "చెల్లాయ్! రేపు మనమిద్దరం ఒకచోటుకు వెళ్ళాలి, రడీగా ఉండు" అన్నాడు. 'ఎక్కడికి?' అంటే, 'నీకు ఉద్యోగం

దొరకబోతోంది' అన్నాడు. 'బి. ఎ. లు, ఎం. ఎ. లు చదివిన నీలాంటి వాళ్ళకే గతిలేదు. ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్ష కూడా ప్యాసుకాని దానికి- నాకెవరిస్తారు?' అన్నాను. 'అదికాదు చెల్లాయ్. ఒక ప్రైవేట్ కంపెనీ. వా ... లేడీ క్యాండిడేటు కావాలిట. స్కూల్ ఫైనల్ వరకు చదివి ఉంటే చాలు ప్యాసయి తీరాలన్న నిబంధనలేదు. నీకెందుకు- నేను చెప్పినట్లు విను. అటు అమ్మ మంచంలో ఉంది. నాకు ఎక్కడా ఉద్యోగం దొరికేట్లు లేదు. కనీసం నీకయినా ఈ జాబ్ దొరికితే మన కష్టాలు కొంతవరకు తీరతాయి ' అన్నాడు జాలిగా ముఖంపెట్టి. ఇక నేనేం మాట్లాడ లేదు. పైగా అనుకోని అదృష్టంగా ఉద్యోగం దొరకబోతోంది! ఆ రాత్రి నాకు దొరకబోయే ఉద్యోగం గురించీ, అక్కడ నేను నడుచుకోవలసిన రీతుల గురించీ ఆలోచిస్తూ పడుకున్నాను.

మర్నాడు సాయంత్రం ఆరుగంటలు ప్రాంతంలో నన్ను ఒక ఇంటికి తీసుకు వెళ్ళాడు.ఆ ఇంట్లో ఒక నడివయస్కుడు- అతడే ఆ ప్రైవేట్ కంపెనీకి మేనేజరు అని పరిచయం చేశాడు అన్నయ్య. నన్ను అక్కడ కూర్చోబెట్టి 'ఇప్పుడే వస్తాను ఉండు చెల్లాయి' అని ఏదో పని వున్నట్లు బయటకు వెళ్ళాడు. అయిదు నిమషాలు. వాడు తిరిగిరాలేదు.

బావా! నిజంగా అన్నయ్య అంతటి స్వార్థపరుడు మరొకడు ఈ భూమ్మీద ఉండడేమో. తను స్వర్గశిఖరాలను చేరు కోవాలని నన్ను యమకూపంలోకి తోసే శాడు. అక్కడ ఒంటరిగా మిగిలిన నా స్థితిని గురించి ఏం చెప్పమంటావు? కామాంధుడైన ఆ నడివయస్కుడి చేతిలో నా బ్రతుకే బలైంది. జీవితమే శూన్య మయింది.

రాత్రి పదిగంటలకు ఒళ్ళు తెలియని స్థితిలో రిక్షామీద ఇంటికిచేరాను. అన్నయ్య ముఖం చాటువేసి గదిలోంచీ బయటకు రాలేదు. ఆనాడే నేను బలవంతానా ప్రాణం తీసుకోవలసింది. కానీ, విపరీతమయిన చలిజ్వరం ఇంటికి వచ్చి అలా మంచం మీద పడిపోయాను. అంతే వారంరోజుల వరకు లేవలేదు. నేను జ్వరంనుంచీ తేరు కొనే సరికే అన్నయ్యకు ఉద్యోగం వచ్చి నట్లు తెలిసింది. అప్పుడే వాడి ప్లాను ఏమిటో నా కర్థమైంది. ఆంతర్యం తెలిసీ వాడితో నేనిక ఏంమాట్లాడలేదు ఉద్యోగం దొరకలేదని మాత్రమే అమ్మకు తెలుసు. నా పతనం ఆమె ఊహకుకూడా అందని విషయం.

ఎప్పటికప్పుడు ఈ బ్రతుకుమీద విరక్తి కలిగి చనిపోదామనుకుంటాను. కానీ, ఏమిటో బలహీనత, దానికి మూలం మంచంలో ఉన్న అమ్మ. అయినా మనిషి ఏ పనిచేసినా ఒకానొక ఆవేశంలో చేస్తాడు. ఆ సమయం దాటిపోతే అది చెయ్యలేడు. అలాగే తయారయింది నా జీవన్మరణ సమస్య.

ఒకరోజు నాఆలోచనలలోకి అత్తయ్య, మాలతి, నీవు అందరూ వచ్చారు మామయ్య పోయాడు. పాపం నీవు ఉద్యోగం దొరక్క అవస్థపడుతున్నావు. ఎలాగో నేను చెడిపోయినదాన్నే. పగిలిన అద్దాన్ని నేను. నా సమాధిమీద స్వార్థ

పరుడు అన్నయ్యా పునాది వేసుకున్నాడు. నీ సంగతి నాకు తెలుసు. నువ్వు ఉత్తముడవు. అలాంటి నీకు నా చేతిలో పనిచేసి పెడితే? అందుకే రప్పించాను. ప్రయత్నాలు చేశాను. కానీ ఫలించకపోయాయ్ అవి. ఇక లాభంలేదని నిన్ను మాయ పుచ్చి మీ వూరు వెళ్ళిపొమ్మన మన్నాను.

తను దిగజారిపోయిన అన్నయ్య నిన్నూ దిగజార్చాలని చూశాడు. అందుకే మాలతిని తను చేసుకోవటానికి మనిద్దరి పెళ్ళి అడ్డుపెట్టి ఉత్తరం వ్రాశాడు వాడు. నా సలహా ప్రకారం మాలతిని అన్నయ్యకు ఇచ్చి చెయ్యకు. ఇతరంగా సంబంధాలు చూడు. ఎందుకంటే ఈవేళ స్వంత చెల్లెల్నే తన అవసరానికి ఉపయోగించుకున్నవాడు, రేపు మరో కారణాన తాళికట్టిన పెళ్ళాం అనికూడా చూడకుండా భార్యను కూడా అమ్ముకోగలడు!

బావా! బయటి పరిస్థితులు నీకూ తెలుసు లక్షలకొలదీ నిరుద్యోగులు పేరుకు పోతున్నారు దేశంలో. వీళ్ళందరికీ ఉద్యోగాలు దొరకటం ఇప్పట్లో జరిగే పనికాదు. ఉద్యోగం దొరకలేదని నిరుత్సాహపడి చదివిన చదువును వ్యర్థం చేసుకోకు. కష్టపడి ఏదో కీతిన సంపాదించి నీ వాళ్ళను పోషించి సంతోషపెట్టు. నా అన్నయ్య తనపిచ్చి ఊహలకు స్వస్తిచెప్పి ఏ రిక్షానో త్రొక్కి- ఇంట్లో గంజినీళ్ళు త్రాగినా నేను ఎంతో ఆనందించేదాన్ని. కానీ వాడు నా జీవితానికే కళంకం తెచ్చాడు. ఏ అన్నా తన చెల్లెలి విషయంలో ప్రవర్తించనంతటి అమానుషంగా ప్రవర్తించాడు దుర్మార్గుడు.



"ఎక్కువ మంది పిల్లల్ని కనడమే ఓ పెద్ద శిక్షయినప్పుడు... ఇంకా వేరే శిక్షలూ... జరిమానాలూ ఎందుకండీ? !"

ఇక వెనక ముందు ఆలోచించకు బావా! కార్యోన్ముఖుడవుకా. నీ చెమట బిందువులను డబ్బుగా మార్చుకో. అత్తయ్య, మాలతిలను సుఖపెట్టు. అప్పుడే నా ఆత్మకు శాంతి లభిస్తుంది.

ఇట్లు,
నీకు మళ్ళీ కనిపించని,
నీ సావిత్రి."

ఆ వుత్తరం చదివిన ప్రకాష్ కళ్ళు గిర్రున తిరిగిపోయాయి. భూమి తల్లక్రిందులై పోయినట్లు తోచింది.

"ఏమిట్రా అన్నాయ్? ఎక్కణ్ణుంచీ ఉత్తరం?" అడిగింది మాలతి వచ్చి.

"ఒక ఫ్రండ్ దగ్గర్నుంచీ మాలతీ." అంటూ జేబులో పెట్టుకున్నాడు దాన్ని.

"భోజనాలకు రండిరా వడ్డించాను" లోపల్నుంచీ తల్లిపిలుపు విని లోపలకు

వెళ్ళారు ఆ అన్నా చెల్లెళ్ళు.

* * *

"అమ్మా! ఈ మూడు రూపాయలూ తీసుకో. ఇది నా ఈరోజు సంపాదన" అన్నాడు ప్రకాష్ తను తెచ్చిన డబ్బులను సంతోషంగా తల్లి చేతిలో పెడుతూ.

సరస్వతమ్మ. మాలతి ఇద్దరూ ఆశ్చర్య పోయారది చూసి.

"అవునమ్మా. ఉద్యోగం దొరకటం లేదని ఎంతకాలం ఖాళీగా కూర్చోవటం? ఏదో పని.... ఫ్యాక్టరీలో కూలీపనికి వెళ్ళాను." అన్నాడు సగర్వంగా.

"చెల్లాయ్! నువ్వుమాత్రం ఇంట్లో ఎంతకాలం ఇట్లా కూర్చుంటావ్? కాలేజీల్లో చదివి లాభంలేదు. పోనీ, టీచరు ట్రైనింగ్‌కు వెళ్ళకూడదూ?" అన్నాడు ప్రకాష్ మాలతితో.

"అదేమిట్రా? హరి ఉత్తరం వ్రాశాడు కద? నిక్షేపంగా పెళ్ళిచేసుకొని అత్త వారింటి వెళ్ళవలసిన దాన్ని ఇప్పుడు ఈ చదువులంటావ్?" సరస్వతమ్మ నసిగింది.

"అవన్నీ నాకు తెలుసులే అమ్మా. అన్నీ ఆలోచించే నేనీ నిర్ణయానికి వచ్చాను. ముందు మాలతిని చెప్పనీ... ఏమంటావు చెల్లాయ్?" అడిగాడు మాలతి ముఖంలోకి చూస్తూ.

"నీవు ఎలా అంటే అలా.... అట్లాగే. ఆ ఏర్పాటు చేస్తే తప్పకుండా చదువు కుంటాను" అంది మాలతి.

"మరి పెళ్ళి మాటేమిటిరా?" అసహనం వల్ల కొంచెం గట్టిగానే ధ్వనించింది సరస్వతమ్మ స్వరం.

"ఆ మాట నేను ఏమీ చెప్పలేను. ఉండమడి. మీకొక ఉత్తరం ఇస్తాను. అది చదువుకున్న తర్వాత మాట్లాడుదురుగాని" అంటూ తన గదిలో భద్రంగా దాచిన సావిత్రి ఉత్తరం తేవటానికని వెళ్ళాడు ప్రకాశం.

***


# శ్రీ బాలాజీ వైద్యశాల



సెక్సు స్పెషలిస్టు డా॥ పి. హనుమంతస్వామి దేవర

మార్కెటు కుడివద్ద; ఫోన్: 551, తెనాలి (ఏ. పి.)

బ్రాంచి: 9-డి, శివాజీ స్ట్రీట్, మద్రాసు-17.

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యము

హస్త ప్రయోగం, అతి సంభోగం వలన అంగము చిన్నదై సంభోగ కాలమందు అకస్మాత్తుగా అంగము కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక డోస్‌తో ఎన్నడూ కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయి నిచ్చును. అసంతృప్తి చెందు స్త్రీ, పురుషులు వాడతగినది. స్వస్థులు), హెర్నియా (గిలక), కుష్టు, బొల్లి, చర్మవ్యాధులకు పోస్టుద్వారా కూడా నయం చేయబడును. వరిబీజము (బుడ్డ), మూత్రవ్యాధులకు ఆపరేషన్ లేకుండా నయం చేయబడును. స్వయంగా రండి. క్షయ, ఉబ్బసమునకు ఉచితం, రండి.

బ్రాంచీలు:—తిరుపతి, నెల్లూరు, గుంటూర్లలో త్వరలో తెరవబడును.